


# ౬౨ వ భాగం

## దక్ష ప్రజాపతి – 11

### శివానుగ్రహం

దేవతలు దక్ష యజ్ఞవినాశనం తర్వాత బ్రహ్మ దగ్గిరకి వెళ్ళి మొర పెట్టుకుంటే తప్పు అందరిదీ కనక వెళ్ళి శివుణ్ణే అడుగుదాం ఏం చేయాలో అని చెప్పాడనీ, వాళ్లని వెంటబెట్టుకుని వెండికొండ దగ్గిరకి వెళ్ళాడనీ చూసాం క్రితం వ్యాసంలో. ఇప్పుడలా కైలాసం లోకి వెళ్ళేసరికి,

సీ. ఉజ్జ్వలంబయి శతయోజనంబుల పొడ;
వొగిఁ బంచసప్తతి యోజనముల
పఱపును గల్గి యే పట్టునఁ దఱుగని;
నీడ శోభిల్ల నిర్ణీత మగుచుఁ
బర్ణశాఖా సమాకీర్ణమై మాణిక్య;
ములఁ బోలఁగల ఫలములఁ దనర్చి
కమనీయ సిద్ధయోగక్రియామయ మయి;
యనఘ ముముక్షు జనాశ్రయంబు [4-136]

తే. భూరిసంసార తాప నివారకంబు
నగుచుఁ దరురాజ మనఁగఁ బెంపగ్గలించి
భక్తజనులకు నిచ్చలుఁ బ్రమద మెసఁగ
వలయు సంపద లందు నావటము వటము. [4-136-.1]

వంద యోజనాల పొడవూ డబ్బై ఐదు యోజనాల వెడల్పూ అయిన మఱ్ఱి చెట్టుని చూసారు. ఆ చెట్టు సంసారం అనే మాహా పాపాలని హరించేది (భూరి సంసార తాప నివారకంబు), ముముక్షువులకి ఆశ్రయమైనటువంటిది. ఇటువంటి వృక్షం కిందనే బుద్ధుడు జ్ఞానజ్యోతి సంపాదించాడని అంటారు. పంచసప్తతి = డబ్బై అయిదు. వెడల్పు అనేదానికి పోతన వాడిన పదం – పఱపు. ఇటువంటి పదాలు చదివిన ఎంతటి తెలుగు పండితుడైనా పోతన భాగవతం పూర్తి చేసాక తనకి అసలు తెలుగు సరిగ్గా రాదనే నిజం ఒప్పుకోక తప్పదేమో. అలాగే, కవి సామ్రాట్ విశ్వనాధ సత్యన్నారాయణ గారి

రామాయణ కల్పవృక్షం చూసి ఏదైనా అర్ధం కాక 'ఇదో షాషాణం' అని ఎవరేనా అంటే, 'పోయి మరోసారి తెలుగు నేర్చుకోండి, నా కావ్యానికి వంకలు పెట్టడం మాని" అనేవారుట. నిజమే కదా?

సీ. ఇద్ధ సనందాది సిద్ధ సంసేవితు;
శాంతవిగ్రహుని వాత్సల్యగుణునిఁ
గమనీయ లోకమంగళదాయకుని శివు;
విశ్వబంధుని జగద్వినుత యశుని
గుహ్యక సాధ్య రక్షో యక్షనాథ కు;
బేర సేవితుని దుర్వారబలుని
నుదిత విద్యాతపోయోగ యుక్తుని బాల;
చంద్రభూషణుని మునీంద్రనుతునిఁ [4-138]

తే. దాపసాభీష్టకరు భస్మదండలింగ
ఘనజటాజిన ధరుని భక్తప్రసన్ను
వితత సంధ్యాభ్రరుచి విడంబిత వినూత్న
రక్తవర్ణు సనాతను బ్రహ్మమయుని. [4-138.1]

అలా బ్రహ్మాది దేవతలకి మర్రి చెట్టుకింద ఉన్న శివుడు కనిపించాడు. ఈ పద్యంలో పోతన మనసులో ఉన్న శివభక్తుడు వీరవిహారం చేయడం కనిపిస్తుంది చూడండి శివుడెటువంటివాడో చెప్తున్నప్పుడు – శాంతవిగ్రహుడు, వాత్సల్యగుణుడు, లోకమంగళదాయకుడు, విశ్వబంధువు, జగద్వినుతుడు, దుర్వారబలుడు (వారింప శక్యం కాని బలం కలవాడు), ఉదితవిద్యాతపోగయుక్తుడు (ఉద్భవించిన విద్యలు, తపస్సు, యోగముతో కూడినవాడు), బాలచంద్రభూషణుడు, మునీంద్రనుతుడు (ముని శ్రేష్టులతో నుతింతబడినవాడు) తాపసాభీష్టకరుడు (తపస్సంపన్నుల కోరికలు తీర్చువాడు), భస్మదండలింగఘనజటాజినధరుడు (భస్మము, దండము, లింగము, గొప్పజటలు, అజిన–లేడి చర్మము ధరించినవాడు), భక్తప్రసన్నుడు, వితత సంధ్యాభ్రరుచి విడంబిత వినూత్న రక్తవర్ణుడు (వితత - విస్తారమైన, సంధ్యాకాల, అభ్ర - మేఘాన్ని పోలిన, వినూత్న – ప్రశస్తమైన, రక్త – ఎర్రని రంగువాడు(, శివుడు , సనాతనుడు (శాశ్వతుడు, శివుడు), బ్రహ్మమయుడు. ఈ సీసంలోనూ ఎత్తుగీతి లోనూ పోతన వాడిన సమాసాలు మరోసారి గమనించండి. నాక్కూడా తెలుగు వచ్చు అనుకునేవాళ్లకి ఇదో కనువిప్పు అయి తీరుతుంది.

ఇన్ని సమాసాలు వాడి అసలు శివుడు ఇటువంటి వాడు అని చెప్పడం దేనికి? ఎందుకంటే 'శివ' అంటే మంగళకరుడు అని చెప్పడానికీ, అసలు శివుడంటేనే కోపం రానివాడని చెప్పడానికీను. మరి వీరభద్రుణ్ణి సృష్టించి దక్షుణ్ణి నాశనం చేయమన్నాడుగా కోపంతో? దాని గురించి ఆలోచిస్తే తెలిసేది ఏమిటంటే, మొదట దక్షుడికి కోపం శివుడిమీద, పోనీ అని ఊరుకుంటే గర్వంతో పరమేశ్వరుడికే శాపం పెట్టాడు. ఆ తర్వాత కూతురు ఇంటికొస్తే అవమానించాడు. సతీదేవి దేహ త్యాగం చేస్తుంటే తనకేం పట్టనట్టూ ఊరుకున్నాడు. ఇన్ని చేసాక మరి తాను చేసిన పాపాలకి శిక్ష అనుభవించడం సరైన పద్ధతి. వీటన్నిటికి శివుడు సాక్షి మాత్రమే. అంటే తనలో ఉన్న కోపమే దక్షుణ్ణి నాశనం చేసింది ఎందుకంటే మనిషిలో భగవంతుడున్నాడు, నేను ఆయన్ని తెలుసుకోవాలి అనే అన్వేషణ – ముముక్షత్వం ఎలా వస్తుంది? తనలోనే ఉన్న భగవంతుణ్ణి తెలుసుకోవాలనే జిజ్ఞాస వల్ల. శివుడు దక్షుడినుంచి వేరుగా లేడు. ఆయనలోనే ఉన్నాడు అయితే అది తెలుసుకోలేదు కనక ఆయన కోపం ఆయన శరీరం మీదే పడింది. ఇప్పటి రోజుల్లోలాగానే – అంటే కోపం

అణుచుకోలేకపోతే అది పెరిగి హృద్రోగమో, పక్షవాతమో రావడం మనం చూస్తూనే ఉన్నాం కదా? దక్షుడిలో ఉన్న ఈ మనఃస్సాక్షి శివుడే. అందువల్ల మనం చేసిన పాపాలకి భగవంతుడు సాక్షి మాత్రమే.

సీ. అంచిత వామపాదాంభోరుహము దక్షి;
ణోరుతలంబున నొయ్య నునిచి
సవ్యజానువుమీఁద భవ్యబాహువు సాఁచి;
వలపలి ముంజేత సలలితాక్ష
మాలిక ధరియించి మహనీయ తర్కము;
ద్రాయుక్తుఁ డగుచుఁ జిత్తంబులోన
నవ్యయం బయిన బ్రహ్మానందకలిత స;
మాధి నిష్ఠుఁడు వీతమత్సరుండు [4-140]

తే. యోగపట్టాభిరాముఁడై యుచిత వృత్తి
రోషసంగతిఁ బాసి కూర్చున్న జముని
యనువునను దర్భరచిత బ్రుస్యాసనమున
నున్న మునిముఖ్యు నంచిత యోగనిరతు. [4-140.1]

సరే, ఇప్పుడు కైలాసంలో బ్రహ్మాది దేవతలకి కనిపించిన శివుడు ఎలా ఉన్నాడు? పద్మాసనంలో కూర్చుని, యోగ ముద్రలో ఎడమమోకాలిపై శుభాలనిచ్చే చేయి సాచి (సవ్య జానువు మీద భవ్యబాహువు సాచి), చేతిలో జపమాలతో సమాధి నిష్టలో మాత్సర్యం అనేది లేకుండా, యోగపట్టంతో ఒప్పుతూ ఉన్నాడు.

ఈ ఎత్తుగీతి పద్యంలో 'యోగపట్టాభిరాముడై' అన్నది గమనించారా? ఆ రోజుల్లో ఉన్న శివ విష్ణు తారతమ్యాల వల్ల కలహాలు రాకుండా ఉండడం కోసం, "శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే' అనేది చెప్పడానికా అన్నట్టూ, భాగవతం రాస్తూ తనలో శివభక్తుడు శివుణ్ణి ఇంత కీర్తిస్తున్నాడేమిటా అనే ఆలోచన, సందేహం చదివేవాళ్ళకి రాకుండా ఉండడానికీ, అన్నింటికన్నా మించి తనని భాగవతం తెనిగించమన్న రామభద్రుణ్ణి అనుక్షణం మరిచిపోకుండా ఉండడానికీ అన్నట్టూ ఇది రాసినట్టు కనిపిస్తుంది.

క. అలఘుని నభవుని యోగీం
ద్రులు వినుచుండంగ నారదునితోఁ బ్రియ భా
షలు జరుపుచున్న రుద్రుని
సలలిత పన్నగ విభూషు సజ్జనపోషున్. [4-141]

క. కని లోకపాలురును ముని
జనులును సద్భక్తి నతని చరణంబులకున్
వినతు లయి, రప్పు డబ్జా
సనుఁ గని యయ్యభవుఁ డధిక సంభ్రమ మొప్పన్. [4-142]

ఇలా వచ్చిన బ్రహ్మాది దేవతలని చూసి, అప్పటివరకూ నారదుడితో మాట్లాడుతున్న రుద్రుడు సంభ్రమంగా చూసాడు – ఇలా అందరూ వచ్చారేమిటా అనుకుని కాబోలు. మరోసారి పోతనలో శివభక్తుడి భాష చూడండి – శివుడు సలలిత పన్నగ విభూషుడు, సజ్జనపోషుడు.

క. అనఘ! మహాత్ముం డగు వా
మనుఁ డా కశ్యపునకొగి నమస్కారము చే
సినగతి నజునకు నభివం
దన మొగిఁ గావించె హరుఁడు దద్దయుఁ బ్రీతిన్. [4–143]

వెంఠనే వచ్చిన బ్రహ్మకి శివుడు నమస్కారం చేసాడు. ఎటువంటి నమస్కారం? వామనుడు పుట్టినప్పుడు ఉపనయన సమయంలో తండ్రి కశ్యపుడికి చేసిన నమస్కారంలా ఉందిట ఆ నమస్కారం. అంటే అతివినయంగా తండ్రి కి నమస్కారం చేసాడు. ఈ విషయంలో మరో సారి శివుడి గురించి పోతన చెప్పేదేమిటంటే, శివుడు ప్రతీ క్షణంలోనూ కోపంతో మండిపోయేవాడు కాదు. యోగీశ్వరుడైన విద్యా వినయస్సంపన్నుడు.

తే. అంత రుద్రానువర్తు లైనట్టి సిద్ధ
గణ మహర్షి జనంబులు గని పయోజ
గర్భునకు మ్రొక్కి; రంత నా కమలభవుఁడు
శర్వుఁ గని పల్కె మందహాసంబుతోడ. [4–144]

శివుడిలా నమస్కారం చేయగానే, రుద్రు గణాలు కూడా బ్రహ్మకి (పయోజగర్భుడు – పద్మంలో పుట్టినవాడు) నమస్కారం పెట్టారు. అప్పుడు బ్రహ్మ చెప్తున్నాడు శివుడితో

తే. జగములకు నెల్ల యోనిబీజంబు లైన
శక్తి శివకారణుండవై జగతి నిర్వి
కార బ్రహ్మంబ వగు నిన్నుఁ గడఁగి విశ్వ
నాథుఁ గా నెఱిఁగెద నా మనమున నభవ! [4–145]

జగాలకన్నింటికీ ఉత్పత్తి స్థానం నువ్వు, శివ, శక్తి తత్వాలకి కారకుడవి. నువ్వే విశ్వనాధుడవని మనసులో తెలుసుకున్నాను. దీనర్ధం ఏమిటంటే, పరబ్రహ్మన్ని తెలుసుకోవాలంటే మొదట తెలుసుకోవాల్సింది ఏమిటి? రమణులు చెప్పినట్టుగా 'నేనెవరిని' అనేది శోధించడం. అది తెలిస్తే శివ, శక్తి తత్వాలు తెలిసి అసలు భగవంతుడంటే తెలుస్తుంది కదా? అలా మనలోని ఆత్మని తెలుసుకోవడమే జగములకు నెల్ల యోనిబీజంబులైన శివ శక్తి రూపాలని తెలుసుకోవడం. అది నాకు తెలిసింది అని చెప్తున్నాడు బ్రహ్మ.

తే. సమత నది గాక తావకాంశంబు లైన
శక్తి శివరూపములఁ గ్రీడ సలుపు దూర్ణ
నాభి గతి విశ్వ జనన వినాశ వృద్ధి
హేతుభూతుండ వగుచుందు వీశ! రుద్ర! [4–146]

నీ అంశలైన శివ, శక్తి (తావకాంశంబులైన) రూపాలతో చేసే ఆటలాగ, సాలీడు (తూర్ణనాభి – సాలీడు నోట్లోంచి దారం తయారు చేస్తూ ఉంటుంది. కానీ అదే దారాన్ని తన పొట్టలో నింపుకుంటూ ఉంటుంది.) లాగ విశ్వం పుట్టి పోషించబడడానికీ, అదే విశ్వం వినాశనం అవడానికీ కారణభూతుడవౌతున్నావు. మరోలా చెప్పాలంటే, తన స్వేఛ్ఛతో పరమాత్మ లోకాలని సృజిస్తూ, లయం చేస్తూ ఉంటాడు. దీన్నే భగవద్గీత విభూతియోగంలో చూడవచ్చు.

అహ మాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః
అహ మాదిశ్చ మధ్యం చ భూతానా మంత ఏవ చ (భగవద్గీత, విభూతి యోగం. 20)

(అర్జునా, నేను ప్రాణులందరి హృదయంలో ఉండే ప్రత్యగాత్మను, వాటి ఉత్పత్తి, స్థితి, ప్రళయకారకుడను – ఆది, మధ్య అంత స్థితులకి కారకుడు). ఈ స్థితి కారకుడి గురించి మరో శ్లోకంలో పార్ధసారధి చెప్తున్నాడు చూడండి.

యచ్చాపి సర్వ భూతానాం బీజం త దహ మర్జున
న త దస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరం (39)

(సర్వభూతాలకీ కారణమైనది ఏదైతే ఉందో అది నేనే. విశ్వంలో ఉన్న స్థావర జంగమాలలో ఓ ఒక్క వస్తువుకూడా నా శక్తి లేకుండా నిలవగలిగేది లేదు.)

వచ్చే వ్యాసాలలో బ్రహ్మ శివుడితో దక్షుణ్ణి బతికించమని వేడుకోవడం, బతికిన దక్షుడి అహంకారం తో ఉన్న తలపోయి మేక తల రావడం; అలా ఆ తల పోవడం అంటే అసలు మనం అర్ధం చేసుకోదగ్గదీ అవీ చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS